# రేపటి మాట

నాయుని కృష్ణమూర్తి



"వేడివేడి పకోడీలు తింటే బాగుంటుంది" - ఈ మాట అన్నది జానీ.

ప్రత్యేకించి ఎవరినీ ఉద్దేశించి జానీ ఆ మాట అనలేదు. అతడు కాకుండా ఆ సమయంలో అక్కడ ఇంకా అయిదుగురం ఉన్నాం. నేను, చిన్నవేణు, పెద్దవేణు, వెంకటరెడ్డి, రాజశేఖర్.

"జానీ! నువ్వు కొంచెం పైకి లేచి, వెనక్కు తిరిగి బాబూమోహన్ స్టయిల్లో వంగుతావా?" చిన్నవేణు అన్నాడు.

ఆ అభిప్రాయం అందరికీ మనసుల్లో ఉంది కాని, వాచ్యంగా ప్రకటించింది చిన్నవేణు మాత్రమే!

వేడివేడి పకోడీలు తినాలనే జానీ కోరడం అపరాధం కాదు. కాని, ఆ సమయం- స్థలం- వాతావరణం జానీ అతి సాధారణ కోరికను అపరాధం కిందికి మార్చాయి.

మేం ఆరుమందీ సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుంటే సన్నగా తుంపర మొదలయింది. కాస్సేపు పడి ఆగిపోతుందిలే అని అనుకుంటూ ఉండగానే వాన ఎక్కువ అయింది.

గబగబా అడుగులు వేసి మూసివేసిన ఒక కళ్యాణ మండపం అరుగుమీదికి చేరి తల దాచుకున్నాం.

ఒక్క ఆటోగాని, రిక్షాగాని అటూ ఇటూ తిరగడం లేదు.

ఇల్లు చేరడం ఎలా భగవంతుడా అని అనుకుంటూ ఉండగా జానీ తన కోరికను బయటపెట్టాడు.

జానీ కోరిక నెరవేర్చాలి అనుకుంటే ఎవరో ఒకరు వానలో తడవడానికి, సుమారు ఫర్లాంగు దూరం వెళ్లి వెనక్కు రావడానికి సిద్ధపడాలి.

తెచ్చి పెడితే తినడానికి అందరూ సిద్ధమే కాని, అంత తతంగానికి ముందు పడే ఓపిక ఎవరికీ లేదు.

ఆ సంగతి జానీకి కూడా తెలును. తన కోరిక నెరవేరదు అని తెలిసినా ఉండబట్ట లేక ఆ మాట అన్నాడని నాకు అర్థం అయింది.

మేం ఆరుమందీ సమాజంలో ఆరు వర్గాలకు సంబంధించిన వాళ్లం. జానీ న్యాయవాది. క్రిమినల్, సివిల్ ఏ కేసు వచ్చినా వదలిపెట్టడు. అతడు న్యాయంకోసం వాదిస్తాడని నాకేమాత్రం నమ్మకం లేదు.

పెద్దవేణు రిటైర్డ్ తెలుగు పండితుడు. నిన్నటితరం మనిషి. భావితరాన్ని మలచడం అనే పవిత్రమైన వృత్తిలో అతడు ఎన్ని జీవితాలను ఎలా మలచాడో నాకు తెలీదు.

చిన్నవేణు - ఆదర్శంగా ఉండాలని, మాట్లాడాలని తాపత్రయపడుతూ ఉంటాడు. సమసమాజం అతని కల. 'నువ్వు భ్రమల్లో ఉండి మమ్మల్ని అందర్నీ ఆ భ్రమల్లోకి లాగాలని వృథా శ్రమ పడుతూ ఉంటావు' అని సన్నిహితులు అంటూ ఉంటారు.

రాజశేఖర్ ఒక స్కూల్లో క్లర్కుగా పని చేస్తాడు. తన పనేమో తనేమో అనుకునే ఒకవర్గం గుమస్తా బుద్ధి అతనిది.

వెంకటరెడ్డి బ్యాంకులో ఆఫీసర్. ఉదయం పదింటినుంచి సాయంత్రం అయిదింటి వరకూ గానుగెద్దు జీవితం

